నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 26 జూన్ 2024 | HYDERABAD

ఆర్టీసీ ఇక డిజిటల్

ఫోన్ పే, గూగుల్ పే, డెబిట్, క్రెడిట్ కార్డుతో బస్సుల్లోనే టికెట్లు జారీ

విజయవంతంగా పూర్తయిన బండ్లగూడ పైలెట్ ప్రాజెక్ట్

70 మంది కండక్టర్లకు టికెట్ జారీ యంత్రాలు

ఇకపై నగరమంతా డిజిటల్ సేవలు

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : ఇకపై ఆర్టీసీ బస్సుల్లో టికెట్ల కోసం చిల్లర వెతుక్కోవాల్సిన అవసరం లేదు. మరికొన్ని రోజుల్లో డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను ఆర్టీసీ వేగవంతంగా తీసుకురాబోతుంది. ఇకపై ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డు స్వైపింగ్ తదితర అన్నీ రకాల పేమెంట్స్ విధానాలతో టికెట్లు జారీ చేయనున్నారు. సాధారణంగా బస్సు టికెట్ల జారీలో చిల్లర బెడద కారణంగా కండక్టర్లు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహించి టికెట్ జారీ చేయడానికి గ్రేటర్ ఆర్టీసీ అధికారులు చర్యలు మొదలెట్టారు. అందులో భాగంగానే బండ్లగూడ డిపోను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 70 బస్సుల్లో టికెట్ జారీ యంత్రాలను కండక్టర్లకు అందజేశారు. 20 రోజుల నుంచి డిజిటల్ చెల్లింపులతోనే టికెట్లు జారీ చేశారు. ఆ యంత్రాల పనితీరులో ఏమైనా లోపాలున్నాయా? ఎంత సమయంలోపు పేమెంట్ అవుతుంది? స్కాన్ చేయడంలో ఇబ్బందులు ఉన్నాయా? తదితర సాంకేతిక సమస్యలపై ఆర్టీసీ స్టడీ చేసింది. ఈ ప్రాజెక్టులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని తేలింది. దీంతో నగర వ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను తీసుకురాబోతున్నారు. అందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. కాగా, గ్రేటర్‌లో 2841 బస్సులు ఉన్నాయి. వివిధ మార్గాల్లో 31,369 ట్రిప్పులు బస్సులు తిరుగుతాయి. ప్రతీ రోజు 20 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తాయి. బస్సుల్లో ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియ తీసుకురాబోతుండటం పై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మియాపూర్‌లోని హెచ్ఎండీఏ స్థలంలో అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మంగళ వారం ఎర్రబెల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేలు కలిశారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ప్రకాశ్ గౌడ్, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, కేపీ వివేకానంద్, ముఠా గోపాల్, ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, దండే విఠల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామన్న, పార్టీ నేతలు మల్లేశ్, శ్రీధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు. - మియాపూర్, జూన్ 25

భూములు ఆక్రమిస్తే చర్యలు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

మియాపూర్, జూన్ 25 : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక హెచ్చరించారు. శేరిలింగంపల్లి మండలం మియాపూర్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని సర్వే నం.100, 101లో ఇటీవల పెద్ద ఎత్తున ఆక్రమణలకు ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో, మంగళవారం సదరు భూములను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇండ్ల స్థలాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునే విధానం ఉంటుందని, దానిపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు. అందుకు భిన్నంగా తమకు తామే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు యత్నించటం సరికాదన్నారు. ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ స్థలం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అలాగే కంచె ఏర్పాటు పనులను సత్వరమే ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ స్థల ఆక్రమణకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్ వెంకారెడ్డి, అధికారులు ఉన్నారు.

హెచ్ఎండీఏ భూములకు జీఐఎస్ మ్యాపింగ్

8500 ఎకరాలకు జియో ఫెన్సింగ్

కబ్జాలను అడ్డుకునేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ): మియాపూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జా ప్రయత్నాలతో హెచ్ఎండీఏ మేల్కొంది. గ్రేటర్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లో ఉన్న భూములను రక్షించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనుంది. జియో గ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ (జీఐఎస్) పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా హెచ్ఎండీఏకు చెందిన భూము ల సరిహద్దుల కో ఆర్డినేట్స్‌ను గూగుల్ మ్యాప్‌లో కచ్చితంగా గుర్తించేలా చర్యలు చేపట్టారు. మియాపూర్‌లో సర్వే నం.100, 101లో 445 ఎకరాలు ఉండగా, మిగతా ప్రాంతాల్లో సుమారు 7500 ఎకరాల భూమి ఉంది. వీటికి గూగుల్ మ్యాప్‌లో వాటి సరిహద్దులను జియో మ్యాపింగ్ ద్వారా గుర్తించడంతో వాటి సరిహద్దులను చేరిపేసేందుకు వీలుండదని, కబ్జా చేయడానికి అవకాశం ఉండదని హెచ్ఎండీఏ ఎస్టేట్ విభాగం అధికారులు తెలిపారు. గూగుల్ మ్యాప్‌లో అక్షాంశాలు, రేఖాంశాలను గుర్తించమే కాకుండా భౌతికంగా భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగానే మియాపూర్‌లో క్షేత్ర స్థాయిలో ఫెన్సింగ్ పనులు మొదలు పెట్టారు. జియో ఫెన్సింగ్ బాధ్యతలను కన్సల్టెన్సీలకు అప్పగించామని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో సమాచారం

హెచ్ఎండీఏకు అప్పగించిన భూములకు జీఐఎస్ మ్యాపింగ్ చేసిన తర్వాత ఆ సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని అధికారులు తెలిపారు. దీనివల్ల హెచ్ఎండీఏ భూములు ఎక్కడెక్కడ ఎంత విస్తీర్ణంతో, సరిహద్దులతో ఉన్నాయో ఆన్‌లైన్‌లోనే గుర్తించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు భవిష్యత్తులో ఆయా భూములు కబ్జాల బారిన పడకుండా ఉంటుంది.

మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను మే 30న కూల్చివేసిన అధికారులు (ఫైల్)

కబ్జాదారులే కథానాయకులు

మియాపూర్ భూముల ఆక్రమణ వెనుక హస్తం వారిదే

అధికారుల నిర్లక్ష్యం.. కబ్జా పర్వానికి దారి తీసిన వైనం

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ): మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూముల కబ్జా ప్రయత్నం సంచలనంగా మారింది. రెండు, మూడు రోజుల పాటు పరిస్థితి అదుపులోకి రావడం లేదని భావించిన పోలీసులు మియాపూర్‌లో 144 సెక్షన్ విధించారు. ఈ కఠిన నిర్ణయానికి దారితీసిన మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూముల కబ్జా వెనుక పెద్ద కథే ఉంది. మియాపూర్ రెవెన్యూ సర్వే నం. 100,101 లో ఉన్న సుమారు 445 ఎకరాల భూమిని ఆనుకొని స్టాలిన్ నగర్, ముజఫర్ అహ్మద్ నగర్, దీప్తీశ్రీనగర్, పీజేఆర్ కాలనీలు ఉన్నాయి. 2003లో ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన భూముల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ లేకపోవడంతో క్రమంగా స్థానికులు కబ్జా చేసి ఇండ్లను నిర్మించారు. కబ్జా చేస్తున్నది ప్రభుత్వ భూమి అని తెలిసినా, దానికి ఎలాంటి పత్రాలు లేకపోయినా గుడిసెలు కాకుండా ఏకంగా జీ ప్లస్ 1, 2 అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. ఇలా హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న భూముల చుట్టూ అక్రమ కట్టడాలు ఉన్నట్లుగా ఆలస్యంగా గుర్తించిన అధికారులు గత నెల 30న కూల్చివేతలు మొదలు పెట్టారు. ప్రైవేటు భూముల సర్వే నంబర్ల ద్వారా ప్రభుత్వ భూములకు బై నంబర్లతో డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసుకోవడమే కాకుండా భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు సర్వే నం. 101లో వెలసిన 15 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.



కట్టేటప్పుడు కళ్లు మూసుకున్నారు..

మియాపూర్‌లో తాజా పరిస్థితులు ఇలా ఉంటే... కబ్జాల పర్వం ఎప్పుడో మొదలైంది. హెచ్ఎండీఏ భూములను కాపాడాల్సిన ఎస్టేట్ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. దాని ఫలితంగానే కబ్జా చేసిన భూముల్లో తాత్కాలిక నిర్మాణాలైన గుడిసెలు, రేకుల షెడ్లు కాకుండా పక్కా భవనాలు నిర్మించారు. అయినా ఆ సమయంలో హెచ్ఎండీఏ అధికారులు మాత్రం అక్రమ కట్టడాలను అడ్డుకోలేదు. వేల కోట్ల విలువ చేసే భూముల్లో నిర్మాణాలు చేస్తుంటే.. అడ్డుకోకుండా వారి నుంచి అంతస్తుకు కొంత మొత్తం చొప్పున వసూళ్లు చేసుకొని మిన్నకుండిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. హెచ్ఎండీఏ ఎస్టేట్ విభాగంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంటులోని పోలీసు అధికారులు సైతం కబ్జాదారులకు సహకరించడం వల్లే 2, 3 అంతస్తుల పక్కా భవనాలు మియాపూర్ భూముల్లో వెలిశాయని తాజా కూల్చివేతలతో వెల్లడైంది. విలువైన భూములను కాపాడాల్సిన అధికార యంత్రాంగం కుమ్మక్కైనట్లు తెలుస్తోంది. దీనికి తోడు చుట్టూ ఉన్న కాలనీ, బస్తీ వాసులు సైతం ఈ భూముల్లో పాగా వేయాలన్న పథకంతో వేలాది మంది అక్కడికి వచ్చేలా చేసి కబ్జాకు ప్రయత్నించారు. పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ తీవ్రంగా పరిగణించి మియాపూర్‌లో 144 సెక్షన్‌ను విధించాల్సి వచ్చింది.

పథకం ప్రకారం.. మూకుమ్మడి కబ్జాకు యత్నం

హెచ్ఎండీఏ అధికారులు ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టడంతో ఏమీ చేయలేని కొందరు కబ్జా దారులు తాము కబ్జా చేసిన స్థలాన్నే కాకుండా అక్కడ ఖాళీగా ఉన్న స్థలాన్ని కబ్జా చేసి గుడిసెలు వేయాలన్న ప్రణాళికను రచించారు. అందులో భాగంగానే ఆ చుట్టు పక్కల ఉన్న వారితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని వర్గాల వారికి మియాపూర్ ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకోవచ్చని ప్రచారం చేశారు. మే 30న కూల్చివేతలు చేపట్టిన తర్వాత నుంచి ఇదే పనిలో అక్కడి కబ్జారాయుళ్లు పకడ్బందీ పథకాన్ని రచించి ఒకేసారి వేలాది మంది ప్రజలు మియాపూర్ భూముల్లోకి చొచ్చుకువచ్చేలా చేశారు. మూడు రోజుల పాటు వేలాది మంది పేద ప్రజలు మియాపూర్ హెచ్ఎండీఏ భూముల్లో గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకునేందుకు వస్తే వారిపైనే రాళ్ల దాడికి దిగారు.

స్టాండింగ్ కమిటీ సమావేశం ఎప్పుడు?

ఎన్నికల కోడ్ ముగిసినా పత్తా లేని స్థాయీ సంఘం

మీటింగ్‌పై చొరవ తీసుకోని మేయర్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో స్టాండింగ్ కమిటీ సమావేశాలకు మంగళం పాడారు. ప్రతి వారంలో బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన అన్ని పార్టీలకు సంబంధించిన సభ్యులు, కమిషనర్, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఆయా శాఖల ముఖ్య అధికారులు కలిసి అభివృద్ధి, జంక్షన్లు, చెరువుల సుందరీకరణ, మురుగునీటి మళ్లింపు, పార్కులు, సెంట్రల్ మీడియంలను కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద అభివృద్ధి చేయడం లాంటి కీలక అంశాలపై స్థాయీ సంఘం సభ్యులు చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. అయితే ఇటీవల పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో వారంలో జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాలకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కోడ్ ముగిసి 20 రోజులు అవుతున్నా... సమావేశంపై ఉలుకు పలుకు లేదు. రొనాల్డ్‌రాస్ 15 రోజుల పాటు సెలవులో ఉన్నారన్న కారణంతో సమావేశాలను మేయర్ నిర్వహించలేదు. అయితే ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలను అప్పగించింది. ఎజెండాలను సిద్ధం చేసి ఈ వారంలో స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ కనీసం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ క్రమంలో వచ్చే వారంలోనే స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఉంటాయా? లేక వాయిదాల పర్వాన్ని కొనసాగిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. మొత్తంగా ప్రతి వారంలో రూ. రెండు కోట్ల నుంచి రూ. 3 కోట్ల మేర విలువైన పనులకు బ్రేక్ పడనుండటంతో సమస్యలు మరింత జఠిలమవుతున్నాయి. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చేయడం పై ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరో 21 మంది అరెస్ట్

మియాపూర్: మియాపూర్ ప్రశాంత్‌నగర్‌లోని సర్వే నం. 100, 101లో హెచ్ఎండీఏకు చెందిన భూమిని ఆక్రమించేందుకు యత్నించిన వారి అరెస్టుల పరంపర కొనసాగుతున్నది. గడిచిన రెండు రోజులుగా 31 మందిని అరెస్టు చేసిన పోలీసులు మంగళవారం మరో 21 మందిని అరెస్టు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 52 మందిని అరెస్టు చేసినట్లు మియాపూర్ సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపారు.

వాక్‌లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖైరతాబాద్, జూన్ 25 : మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో (టీ న్యాబ్) ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్ వద్ద మంగళవారం అవగాహన వాక్‌ను ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వాక్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, రాష్ట్ర డీజీపీ రవి గుప్తా, టీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సీపీ కొత్త కోట శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల బారిన పడి ఎంతో మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో మత్తు పదార్థాలు కనబడకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీన్యాబ్ ఆధ్వర్యంలో మత్తుల వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ రూపొందించిన 'రామచక్కని కొడుక' పాటను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ అదనపు డీజీపీ ఎంఎం భగవత్, లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్, అదనపు సీపీ విక్రమ్‌సింగ్, డీజీ (డీసీఏ) కమలాసన్ రెడ్డి, ఐజీ రమేశ్ రెడ్డి,రాచకొండ సీపీ తరుణ్ జోషి పాల్గొన్నారు.



పార్లమెంట్‌లో మంగళ వారం ప్రమాణ స్వీకారం చేస్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

బదిలీలు నిలిచిపోయినట్టేనా?

బల్దియాలో జాబితా సిద్ధమైనా... కమిషనర్ మార్పుతో మరింత ఆలస్యం

అవినీతి, ఆరోపణలతో తిష్టవేసిన అధికారులకు కలిసొచ్చిందని ఉద్యోగ వర్గాల్లో చర్చ

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీలకు బ్రేక్‌లు పడ్డాయా? జాబితా సిద్ధమైన ఇప్పట్లో ట్రాన్స్‌ఫర్స్ ఉండవా? కమిషనర్ మార్పుతో మరిన్ని నెలలు బదిలీల జోలికి వెళ్లరా? అంటే ఉద్యోగ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తున్నది. ఒకే చోట మూడేళ్లకు పైబడి జూనియర్ అసిస్టెంట్ మొదలు, అదనపు కమిషనర్ల వరకు అన్ని విభాగాలకు సంబంధించి పెద్ద ఎత్తున బదిలీలు జరిపేందుకు సిద్ధమైంది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న రొనాల్డ్‌రాస్ శాఖల వారీగా నివేదికలు తెప్పించుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 2500 నుంచి 3వేల మంది ఉద్యోగులను బదిలీ చేయాలని నిర్ణయించారు. కమిషనర్ రొనాల్డ్‌రాస్ సెలవు నుంచి రాగానే బదిలీల ప్రక్రియ ఉంటుందని అందరూ భావించారు. కానీ రొనాల్డ్‌రాస్ స్థానంలో ఆమ్రపాలిని కమిషనర్‌గా నియమిస్తూ రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషనర్ మార్పుతో ఒక్కసారిగా బదిలీల అంశం పక్కదారి పోయే అవకాశాలు కనబడుతున్నాయన్న చర్చ ఉద్యోగుల్లో మొదలైంది. అసలే వర్షాకాలం, నూతన కమిషనర్‌గా శాఖపై పూర్తి స్థాయి పట్టు వచ్చే వరకు బదిలీల అంశానికి వెళ్లేందుకు ఆసక్తి కనబర్చరన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తంగా జీహెచ్ఎంసీలో అవినీతి, ఆరోపణలు, సుదీర్ఘకాలం తిష్టవేసిన ఉద్యోగులకు కమిషనర్ మార్పు కలిసొచ్చాయంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం పర్మినెంట్, ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ సిబ్బంది మొత్తం కలిపి 26 నుంచి 28వేల మంది ఉంటారు. 18,500 శానిటేషన్ వర్కర్లు, 950 సూపర్ వైజర్లు, 500 నుంచి 800 మంది ఆపరేటర్లు, 500 మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, 400 మంది సూపరింటెండెంట్లు , సుమారు 100 మంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, 20 మంది జాయింట్ కమిషనర్లు, 20 మంది మెడికల్ ఆఫీసర్లు, 30 మంది డిప్యూటీ కమిషనర్లు ఉన్నారు. అయితే ఎక్కువగా బదిలీల్లో మూడేళ్లకు పైబడి ఒకే చోట కొనసాగుతుండటం, అవినీతి, ఆరోపణలు, వివాదాస్పద అధికారులకు స్థానం చలనం ఉంటుందని భావించారు. ఇంజినీరింగ్, డిప్యూటీ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి జీహెచ్ఎంసీ నుంచి ఇతర మున్సిపాలిటీలకు, అక్కడి నుంచి జీహెచ్ఎంసీకి మార్పులు, చేర్పులు జరుగుతాయని అధికారుల్లో చర్చ జరుగుతున్న తరుణంలో ఒక్కసారిగా వీటికి మరింత కాలం బ్రేక్ పడినట్లైంది.